క్లుప్తంగా

రక్తదాన శిబిరం



బీబీపేట: స్వాతంత్ర్య సమరయోదులు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని పురస్కరించుకొని తుజాల్‌పూర్‌లో ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నాయకుడు గంప శశాంక్ హాజరై మాట్లాడారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 40 మంది రక్తదానం చేశారు. ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని శశాంక్ కోరారు. అనంతరం వివిధ పోటీలలో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులను సత్కరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, ఎంపీటీసీ సుజాత పాల్గొన్నారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

భిక్కనూరు: కాచాపూర్‌లో శివాజీ విగ్రహ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని సోమవారం ఎంపీపీ గాలిరెడ్డి, మాజీ ఎంపీపీ తోగరి సుదర్శన్, సర్పంచ్ సులోచన, డీసీసీబీ డైరెక్టర్ లింగాల కిష్టాగౌడ్‌లు సోమవారం పరిశీలించారు. వేగవంతంగా శివాజీ విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో భిక్కనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు యేమిమా విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ, ఏఎన్‌ఎం యాదమ్మ, ప్రిన్సిపాల్ నర్సింహరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

రామారెడ్డి(ఎల్లారెడ్డి): రెడ్డిపేట గ్రామానికి చెందిన చెట్టుపల్లి రాజశేఖర్ ఆదివారం టాటా ఏస్ వాహనం ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించలేక ఆత్మహత్యకు పాల్పడాడు. బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ సోమవారం పరామర్శించి, రూ.5 వేలు అందజేశారు. అలాగే కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దికుంట నర్సాగౌడ్ రూ.5 వేల సాయం అందించారు.

బోరుబావి తవ్వకం



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని తొమ్మిదో వార్డు పోచమ్మ గల్లీలో సోమవారం బోరు వేయించినట్లు ఎంపీటీసీ పత్తి శ్రీనివాస్ తెలిపారు. కాలనీలో తాగునీటి సమస్య తీర్చడానికి బోరు వేయించినట్లు తెలిపారు. వార్డు సభ్యుడు నితిన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మహాదేవుని గుట్టపై తాగునీటి సౌకర్యం

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గుడిమెట్ వద్ద గల మహాదేవుని గుట్టపై తాగు నీటి సౌకర్యం కల్పించినట్లు జెడ్పీటీసీ శంకర్ నాయక్ తెలిపారు. బోరు, మోటారు, పైపులైన్ కోసం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ రూ.7.5 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఆ నిధులతో బోరు వేయించి సోమవారం మోటారు ప్రారంభించినట్లు తెలిపారు. గాంధారి సర్పంచ్ సంజీవు, సింగిల్ విండో చైర్మన్ సాయికుమార్ పాల్గొన్నారు.

కరెంటు షాక్‌తో గేదె మృతి

నస్రుల్లాబాద్(బీర్కూర్) : బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన గుత్తుల శ్రీనివాస్‌కు చెందిన గేదె కరెంటు షాక్‌కు గురై మృతి చెందింది. పంటపొలాల్లో ఉన్న బోర్ బావులకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి ప్రమాదవశాత్తు మృతి చెందిందన్నారు. గేదె రూ. 60 వేలు ఉంటుందని వాపోయాడు.

ముగిసిన మల్లికార్జునస్వామి ఉత్సవాలు

దోమకొండ: మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు సోమవారం ముగిసాయి. మల్లన్నస్వామి గొల్ల కేతమ్మ, మేడలమ్మల కల్యాణోత్సవం, రేణుకా ఎల్లమ్మ మునిరాజుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేసి అనంతరం అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించారు.

బగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని బీడీ కాలనీలో గల బగళాముఖి అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి క్రాంతికుమార్, భక్తులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

దోమకొండ: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కానుగంటి శారద సోమవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

నాలుగేళ్లలో ఎంతో అభివృద్ధి చేశా

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్
- బోనాల్‌లో బీరప్ప ఉత్సవాలకు హాజరు



బోనాల్‌లో బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్, స్థానిక ప్రజాప్రతినిధులు

లింగంపేట(ఎల్లారెడ్డి): తాను ఎమ్మెల్యేగా నాలుగేళ్లలో ఎంతో అభివృద్ధి చేశానని, ప్రతీ గ్రామానికి బీటీ, సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేయించానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. బోనాల్ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డును ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పనులు సైతం పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రజలు కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి తిరిగి బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తేవడం ఖాయమన్నారు. పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గ్రామం వరకు బైక్‌పై ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన డ్రైనేజీ, రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.8.50 లక్షలతో నిర్మించిన 125 ఎంటీఎస్ సామర్థ్యం గల గోదామును ప్రారంభించారు. గ్రామంలో జరుగుతున్న బీరప్ప ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఎంపీపీ గరీబున్నిసాబేగం, జెడ్పీటీసీ శ్రీలత, ఏఎంసీ వైస్ చైర్మన్ సిద్దారెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దివిటి రమేశ్, తదితరులు ఉన్నారు.

మొదటి రోజు 454 దరఖాస్తులు



ఎల్లారెడ్డి పట్టణం 9వ వార్డులో దరఖాస్తులను స్వీకరిస్తున్న కౌన్సిలర్, అధికారులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డుల్లో సోమవారం డబుల్ బెడ్ రూం ఇళ్లకు 454 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. మార్చి 3 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని ఆయన తెలిపారు.

అన్ని వార్డులలో స్వీకరించాలి

ఎల్లారెడ్డి: మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డులలో డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించాలని మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన వార్డు అధికారులతో సమావేశం నిర్వహించారు.

'డబుల్' సాధించే వరకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి రైతుల పోరాట స్ఫూర్తితో కామారెడ్డిలో డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం ఉద్యమించాలని సామాజిక తెలంగాణ సాధన సమితి చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీఎల్‌ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పినా ప్రభుత్వం ఇప్పటి వరకు ఇవ్వకపోవడం సరికాదన్నారు. బీఎల్‌ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్, బీఎల్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరిగాద సిద్దిరాములు మాట్లాడుతూ.. నిరుపేదలకు డబుల్ బెడ్‌రూంలు ఇచ్చే వరకు పోరాటాలు ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఎఫ్ నాయకులు ఆంజనేయులు, టీఎల్‌టీయూ జిల్లా కార్యదర్శి కమ్మరి సదానందం, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల నుంచి ప్రజలను కాపాడండి



మద్నూర్‌లో వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

మద్నూర్(జుక్కల్): గ్రామంలో విపరీతంగా పెరిగిపోయిన కుక్కల నుంచి మద్నూర్ గ్రామ ప్రజలను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయానికి సోమవారం గ్రామస్తులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తరలివచ్చి కార్యదర్శి సందీప్, సర్పంచ్ సూర్యకాంత్‌కు వినతి పత్రం అందించారు. నాలుగు రోజుల క్రితం ఇందిరానగర్ కాలనీలో కుక్కల గుంపు ఓ బాలుడిపై దాడికి యత్నించగా స్థానికులు కాపాడడంతో ప్రమాదం తప్పిందని వారు గుర్తు చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్తులు కుషాల్, హన్మండ్లు, కంచిన్ రవి, తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించండి



పిట్లం(జుక్కల్): పిట్లం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి యాదగిరి కోరారు. ఆయన సోమవారం సిబ్బందితో కలిసి పంచాయతీ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటికి తిరిగి పన్నులు వసూలు చేశారు.

ఈసారి బీజేపీకే పట్టం కట్టాలి



పెద్ద తడ్గూర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

మద్నూర్(జుక్కల్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామ గ్రామాన ప్రజలకు అందిస్తున్నామని, ఈ సారి ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీజేపీకే పట్టం కట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు హన్మాండ్లు కోరారు. పెద్ద తడ్గూర్, చిన్న తడ్గూర్, సోమూర్ గ్రామాలలో సోమవారం ఆయన ప్రజా గోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో వాగ్దానాలు చేసి మరిచిపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు పేర్లు మార్చి తమ పథకాలుగా చెప్పుకుంటూ పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పి బీజేపీని ఆశీర్వదించాలని కోరారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వీరేశం, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి తుకారం, శక్తి కేంద్ర ఇన్‌చార్జి లక్ష్మణ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

మెడికో మృతికి కారకులను శిక్షించాలి



జిల్లా కేంద్రంలో ధర్నా చేపడుతున్న పీడీఎస్‌యూ నేతలు..



కొత్తాబాదిలో రాస్తారోకో..

సాక్షి నెట్‌వర్క్ : మెడికల్ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా వ్యాప్తంగా విద్యార్థి, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పలు చోట్ల రాస్తారోకోలు నిర్వహించారు. సీనియర్ విద్యార్థి సైఫ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎంజీఎం డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపల్‌ను విధుల నుంచి తొలగించాలన్నారు. ప్రీతి ఆత్మహత్యపై ఎమ్మెల్యేలు, ఎంపీలు స్పందించకపోవడం బాధాకరమని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలు చోట్ల తహసీల్దార్‌కు వినతి పత్రాలు సమర్పించారు.



నిజాంసాగర్: బొగ్గుగుడిసె వద్ద నివాళులు



ఎల్లారెడ్డిలో బీజేపీ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ

ఇసుక డంప్ సీజ్



సాక్షి ఎఫెక్ట్..

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండల కేంద్రానికి సమీపంలో సోమవారం ఇసుక డంప్‌లను సీజ్ చేసినట్లు డోంగ్లీ తహసీల్దార్ కాంత్రి కుమార్ తెలిపారు. సోమవారం సాక్షి దినపత్రికలో 'ఇసుక రవాణాకు అడ్డుకట్ట ఏది?' అనే వార్త ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్ల ఇసుక కుప్పలను వ్యవసాయ పొలంలో డంప్ చేసినట్లు తెలియడంతో మండల ఆర్ఐ మహమ్మద్ సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మాచారెడ్డి: మండలంలోని పాల్వంచ మర్రి ఆర్‌ఆర్ టాలెంట్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు కరాటేలో ప్రతిభ కనబర్చారు. ఇటీవల సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ స్థాయ కరాటే పోటీల్లో పాఠశాలకు చెందిన ఎ.నవీన్, ఎ.శ్రీకాంత్‌లు ప్రథమ, అభినయ, శ్రీహర్షలు ద్వితీయ బహుమతులను గెలచుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపల్ నరేందర్, సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి సీఎంను కలుస్తాం



మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

బాన్సువాడ టౌన్: అన్ని రంగాల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బాన్సువాడలో సీఎం కేసీఆర్‌ను కలిసి విన్నవిస్తామని సీఐటీయూ జిల్లా నాయకులు రవీందర్, ఖలీల్‌లు అన్నారు. సోమవారం బాన్సువాడలో వారు మాట్లాడారు. అంగన్‌వాడీ, మున్సిపల్, గ్రామ పంచాయతీ, ఆశ వర్కర్ల వేతనాల కోసం ప్రభుత్వ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని అన్నారు. సమస్యలపై గతంలో 108 రోజులు సమ్మె చేశామని, వచ్చే నెల 1న బాన్సువాడకు వచ్చే సీఎం కేసీఆర్‌కు వినతి పత్రం అందజేయనున్నామని, కార్మికులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

ఉపాధిలో అక్రమాలపై చర్యలు తీసుకుంటాం



సామాజిక తనిఖీలో భాగంగా రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సాయన్న, ఇతర అధికారులు

లింగంపేట(ఎల్లారెడ్డి) : ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీవో సాయన్న వెల్లడించారు. సోమవారం లింగంపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజావేదికలో పాల్గొని మాట్లాడారు. 13వ విడత సామాజిక తనిఖీలో భాగంగా 2019 అక్టోబర్ నుంచి 2022 మార్చ్ వరకు మండలంలోని 41జీపీల పరిధిలో రూ. 25.63 కోట్ల విలువైన పనులు చేపట్టామన్నారు. మండలంలోని మోతె, లింగంపేట గ్రామాల్లో అధికంగా అవినీతి, అక్రమాలు జరిగినట్లు గుర్తించి రికవరీకి ఆదేశాలిచ్చామన్నారు. మండలంలోని రాంపల్లి కార్యదర్శి కార్తిక్, క్షేత్ర సహాయకుడు అంజయ్య కలిసి మస్టర్లను కాల్చేసినట్లు తెలిపారు. జీపీపై శాఖాపరమైన, ఇద్దరిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయా జీపీల్లో అవకతవకలు గుర్తించి మేట్లు, కార్యదర్శుల నుంచి రికవరీ చేస్తామన్నారు. ఎంపీపీ గరీబున్నిసా బేగం, హెచ్‌ఆర్ కల్పన, ఫైనాన్స్ మేనేజర్ రామనారాయణ, తదితరులున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ తిర్మల్ గౌడ్



పల్లెబోగుడతండాలో పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

దోమకొండ: సంఘమేశ్వర్‌లో సోమవారం సీసీ రోడ్డు పనులను జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ ప్రారంభించారు. రూ.25 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామంలో ఈ పనులను చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఎంపీపీ కానుగంటి శారద, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగ్ర మధుసూదన్‌రావ్, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, సర్పంచ్ నరేష్ పాల్గొన్నారు.

పల్లెబోగుడతండాలో

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పల్లెబోగుడతండాలో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి స్థానిక సర్పంచ్ బద్దీబాయితో కలిసి ప్రారంభించారు. పంచాయతీ కార్యర్శి సంతోష్ కుమార్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గుండమ్మ కాలువ బైపాస్ రోడ్డుకు మోక్షం

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో గుండమ్మ కాలువ బైపాస్ రోడ్డు సీసీ రోడ్డు పనులకు మోక్షం కల్గింది. పశువుల ఆస్పత్రి నుంచి బాల్‌రాజు గుడి వరకు వేయాల్సిన సీసీ రోడ్డు సాంకేతిక కారణాల వల్ల సగంలో నిలిచిపోయింది. సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు, కాలనీవాసులు ఎమ్మెల్యే సురేందర్‌కు, అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎట్టకేలకు జెడ్పీటీసీ శంకర్ నాయక్, సర్పంచ్ సంజీవు సోమవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. సింగిల్ విండో చైర్మన్ సాయికుమార్, ఉప సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

తెలంగాణ బచావో వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



లింగంపేట(ఎల్లారెడ్డి): మార్చి 10న లింగంపేట మండల కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించే తెలంగాణ బచావో వాల్‌పోస్టర్లను తెలంగాణ జన సమితి ఎల్లారెడ్డి నియోజక వర్గ ఇంచార్జి నిజ్జన రమేశ్ ఆవిష్కరించారు. ఆయన వెంట జిల్లా కన్వీనర్ లక్ష్మన్, రజనీకాంత్, కుమార్, పూల్‌సింగ్, గోపాల్, కిష్టయ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుతో పేదల జీవితాల్లో వెలుగు



కారేగాంలో ప్రారంభిస్తున్న సర్పంచ్ దుర్గయ్య

పిట్లం(జుక్కల్): కంటి వెలుగు కార్యక్రమంతో సీఎం కేసీఆర్ నిరుపేదల జీవితాల్లో వెలుగును నింపుతున్నారని సర్పంచ్ దుర్గయ్య అన్నారు. కారేగాంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పంచాయితీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాతరాజంపేటలో..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణ పరిధిలోని పాతరాజంపేటలో కంటి వెలుగు కార్యక్రమాన్ని కౌన్సిలర్ ఆకుల రూప ప్రారంభించారు. ఆధార్ కార్డు ఉన్న ప్రతిఒక్కరు శిబిరంలో పాల్గొన్ని కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరాలి

పిట్లం(జుక్కల్): విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సర్పంచ్ నారాయణరెడ్డి ఆకాంక్షించారు. ఆయన సోమవారం రాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ రూపొందించిన అభ్యాస దీపికలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. 10వ తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు గ్రామ పంచాయతీ తరపున ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ ఉన్నారు.

దళితులంతా ఏకతాటిపైకి రావాలి

మద్నూర్(జుక్కల్): దళితులు విభేదాలను పక్కన పెట్టి ప్రతి ఒక్కరు ఏకతాటిపైకి రావాలని దళిత హక్కుల పోరాట సమితి బాన్సువాడ డివిజన్ అధ్యక్షుడు కాదేపూరం గంగారాం పిలుపునిచ్చారు. డోంగ్లీ మండల కేంద్రంలో సోమవారం దళిత హక్కుల పోరాట సమితి డోంగ్లీ మండల కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితులకు ఏ గ్రామంలో సమస్య ఉన్నా తామందరం వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మరిబా గాయక్‌వాడ్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్, కోశాధికారిగా సూర్యవంశి నర్సింగ్, ఉపాధ్యక్షులుగా గాయక్‌వాడ్ హన్మంత్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పాఠశాల వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రజాప్రతినిధులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలోని కేరళ స్కూల్ 13వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, నాగిరెడ్డిపేట సర్పంచ్ సునీతరెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ నిర్మల జిమ్మీతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు ఎంపీపీ రాజ్‌దాస్ స్కూల్ జెండాను ఆవిష్కరించారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నతస్థాయిలో స్థిరపడాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు తల్లిదండ్రులను అలరించాయి. ఎస్‌ఎంసీ చైర్మన్ రాజు, సర్పంచ్‌లు లక్ష్మి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తం

వర్మి కంపోస్టుపై అవగాహన

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ ఐకేపీ కార్యాలయంలో సోమవారం 100 రోజుల ఉపాధి పనులు పూర్తి చేసుకున్న వారికి వర్మి కంపోస్టు తయారీపై అవగాహన కల్పించారు. ఏపీడీ మురళి కృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్త విజయ్ కుమార్ ఏపీఎం గంగాధర్, వ్యవసాయ అధికారి శ్రవణ్ ఉన్నారు.

వర్డ్ సంస్థ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతలపై..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారంలో సోమవారం ఉపాధి హామీ కూలీలకు వర్డ్ సంస్థ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ఓండ్ల యశోద పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులకు తప్పనిసరిగా హాజరు కావాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మోడల్ స్కూల్‌లో ఉత్తమ ఫలితాల సాధన కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను విద్యార్థులు ఉపయోగించుకోవాలని సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. సోమవారం పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సుకు అపూర్వ స్పందన

సదాశివనగర్(ఎల్లారెడి): మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఎంఎన్‌ఎస్‌జే క్యాన్సర్ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల అడ్డగింత

భిక్కనూరు: మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం వెనుక స్థలంలో కనకరాజు నిర్మిస్తున్న ఇంటి నిర్మాణ పనులను భిక్కనూరు ఈవో సదాశివ సోమవారం అడ్డుకున్నారు. జీపీ స్థలంలో నిర్మాణ పనులు జరుపుతున్నారని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. దీంతో ఈవో సదాశివ, క్లర్కు సిద్దరాములు పోలీసులతో వచ్చి నిర్మాణ పనులను నిలిపివేయించారు.

మార్కెట్ నిర్మాణ పనులు నిలిపివేయాలి

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డిలో నూతనంగా నాబార్డు నిధులతో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని యువజన సంఘాల సభ్యులు సోమవారం ఈవో లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. గ్రామానికి దూరంగా మార్కెట్ కమిటీ నిర్మాణం జరిపితే ప్రజలకు ఇబ్బంది కలుగుతాయన్నారు. దగ్గరలో మార్కెట్‌ను నిర్మించాలని ఆమెను కోరారు.

జీవాలకు నట్టల నివారణ మందులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జప్తిజాన్కంపల్లిలో సోమవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి గ్రామసర్పంచ్ సాయిలుతో కలిసి పశువైద్యశాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేలకు నట్టల నివారణ మందులను వేశారు. పశువైద్యాధికారి రవికుమార్, సిబ్బంది సతీష్, విజయ, గౌస్, కిషన్ పాల్గొన్నారు.

నర్సరీలో మొక్కలను సంరక్షించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నర్సరీలో పెంచుతున్న మొక్కలను సంరక్షించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. మెల్లకుంటతండాలో సోమవారం నర్సరీని ఆయన పరిశీలించారు. ఎండలు పెరుగుతున్నందున నర్సరీలో మొక్కలు చనిపోకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి సవాయిని ఆయన ఆదేశించారు.